# బహిరంగ విసర్జన నివారణలో మొదటిస్థానం సాధించాలి

## ఈ నెల 30లోగా మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి ❑ మున్సిపల్ మంత్రి నారాయణ



అధికారులతో సమావేశమైన మంత్రి నారాయణ

**కార్పొరేషన్, న్యూస్‌టుడే:** స్వచ్ఛభారత్ అమల్లో భాగంగా సీఎం ఆదేశాల మేరకు మన రాష్ట్రాన్ని బహిరంగ విసర్జన రహితంగా తీర్చిదిద్దాలని, ఈ విషయంలో దేశంలోనే మొదటి స్థానాన్ని సాధించాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖల మంత్రి డాక్టర్ పి.నారాయణ అన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం మున్సిపల్ కమిషనర్లు, విభాగాధిపతులతో సమావేశంలో మాట్లాడుతూ గత రెండేళ్ల నుంచి పురపాలికల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవడంతో పాటు, అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసినట్లు తెలిపారు. నిర్మాణంలో ఉన్నవాటిని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలోని మురికివాడల్లో ఓడీఎఫ్‌లో భాగంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ నెల 25లోగా మరుగుదొడ్ల నిర్మాణాలన్నీ పూర్తిచేయాలని ముందుగా నిర్ణయించామని, అధికారుల అభ్యర్థన మేరకు ఈ నెల 30వ తేదీ వరకూ గడువు ఇచ్చామన్నారు. అక్టోబరు 2కల్లా రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీల్లో వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం మున్సిపాలిటీల వారీగా ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విజయనగరం మున్సిపాలిటీ వెనుకబడి ఉండటంపై ఆర్జేడీ ఆశాజ్యోతిని ప్రశ్నించారు. కేవలం 70 శాతం పూర్తిచేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ సంచాలకుడు కన్నబాబు, ఆర్జేడీలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల స్థాయిని పెంచుతాం

రాష్ట్రంలో పురపాలక పాఠశాలల స్థాయిని పెంచుతామని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి మంత్రి డాక్టర్ పి. నారాయణ అన్నారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదోతరగతి వరకు చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి, వారిలో కనీస విద్యా ప్రమాణాలు పెంచడానికి కృషిచేస్తామన్నారు. దీని కోసం ప్రతి పాఠశాలలో ప్రత్యేకంగా ఉపాధ్యాయులను నియమిస్తామన్నారు. జీవీఎంసీలో ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని, కోర్టు కేసులు వేసినవారితో చర్చిస్తున్నామన్నారు.